క్లుప్తంగా

నేడు గెమ్మెలిలో గడప గడపకు

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి గ్రామ సచివాలయం పరిధిలో గెమ్మెలి కొత్తూరు, గెమ్మెలి, రామచంద్రపాలెం గ్రామాల్లో సోమవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర తెలిపారు. గెమ్మెలి గ్రామంలో నూతన సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభిస్తారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ నామినేటెడ్ పదవిలో ఉన్న నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వారు తెలిపారు.

శ్రమదానంతో గోతుల పూడ్చివేత


చోటముఖిపుట్టు వద్ద గోతులు పూడ్చుతున్న యువకులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే మార్గంలో చోటముఖిపుట్టు గ్రామ సమీపంలో గల వంతెన వద్ద గోతులు ప్రమాదకరంగా మారాయి. తరచూ వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యను ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ మార్గంలో వెళ్లే కొంతమంది యువకులు స్పందించారు. ఈ మేరకు ఆదివారం శ్రమదానంతో గోతులు పూడ్చే కార్యక్రమం నిర్వహించారు. దీంతో అటుగా రాకపోకలు చేసే వాహనచోదకులు, స్థానికులు యువకులను అభినందించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనపై ఉన్న గోతులను తారువేసి పూర్తిస్థాయి పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ


ఏనుగురాయిలో పింఛన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీలో ప్రభుత్వం ద్వారా ఆరుగురికి కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి ఆదివారం పంపిణీ చేశారు. సర్పంచ్ నరసింగరావు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ పాలనలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్ ఇవ్వడం మన ఆంధ్రప్రదేశ్ మినహా దేశంలో మరెక్కడ లేదన్నారు. పంచాయతీ కార్యదర్శి సింహాద్రి, వార్డు మెంబర్లు రామారావు, నీలమ్మ, హరిబాబు, వలంటీర్లు వెంకటరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం కావడంతో ఆదివారం తెల్లవారు జాము నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. వీరు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది.

మాడుగుల రూరల్: కె.జె.పురంలో మోదమాంబకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కె.జె.పురం చెరకు కాటా ఆవరణలో నూకాంబిక అమ్మవారికి పూజలు నిర్వహించారు. రాత్రికి భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లిష్

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో చిల్డ్రన్ క్లబ్ నిర్వహించారు. పిల్లలు కథల పుస్తకాలు చదువుకున్నారు. అనంతరం చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై తర్ఫీదు ఇచ్చారు. ఉపాధ్యాయిని సిహెచ్.భవాని స్పోకెన్ ఇంగ్లిష్‌ను బోధించారు. గ్రంథాలయ అధికారి దమయంతి మాట్లాడుతూ పిల్లలకు గ్రంథాలయాలపై మక్కువ పెంచేందుకు ప్రతి ఆదివారం చిల్డ్రన్ క్లబ్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలకు రావటం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

సంతల్లో వ్యాపారం అదుర్స్

- నాటుకోళ్లు, మేకలు, గొర్రెలకు గిరాకీ
- భారీగా అమ్మకాలు
- రూ.లక్షల్లో లావాదేవీలు
- ఆనందంలో పెంపకందారులు

జి.మాడుగుల: మన్యంలో సంతలకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. వారపు సంతలే గిరిజనులకు సూపర్‌మార్కెట్లు... వారానికి ఒక రోజు జరిగే సంతకు సమీప ప్రాంతాల నుంచి గిరిజనులు వచ్చి తమకు అవసరమైన కూరగాయలు, నిత్యావసర వస్తువులతో పాటు ఇతరత్రా సామగ్రిని కొనుగోలు చేస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో సంత జరుగుతోంది. వ్యాపారులు కూడా గిరిజనులకు అవసరమైన వస్తువులను సంతకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. గిరిజన రైతులు తమ అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొచ్చి సంతల్లో విక్రయిస్తుంటారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో జరిగే సంతలకు చాలా ప్రత్యేకం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో పసుపు, పిప్పళ్లు, చింతపండు తదితర అటవీ ఉత్పత్తుల అమ్మకాలకు ప్రాముఖ్యత ఉండగా, మరికొన్ని సంతలు నాటుకోళ్లు, మేకలు, గొర్రెల క్రయ విక్రయాలకు పేరుగాంచాయి. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి వాటిని కొనుగోలు చేసుకొని తరలిస్తుంటారు.

పెరుగుతున్న ధరలు

మన్యంలోని కొన్ని ప్రాంతాల్లో జోల్డా పండగలతో పాటు గ్రామ దేవతల ఉత్సవాలు, ఇతరత్రా వేడుకలు జరుగుతున్నాయి. దీంతో నాటుకోళ్లు, మేకలు, గొర్రెల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈ మేరకు వారపు సంతల్లో మేకలు, గొర్రెలతో పాటు నాటుకోళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగే వారపు సంతల్లో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలు ధరలు ఆకాశన్నంటుతున్నాయి. మండలంలో సంతబయలు, మద్దిగరువు మంగళ, గురువారం జరిగిన వారపు సంతల్లో అధికంగా మేకలు, గొర్రెలు, నాటుకోడి పుంజులను పెంపకందారులు తీసుకొచ్చారు. వారపు సంతల్లో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలకు డిమాండ్ ఎక్కువ కావడంతో వీటి ధరలకు రెక్కలొచ్చాయి. సంతల్లో ఇవి హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. రానున్న రోజుల్లో సంతల్లో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలు ధరలు భారీగా పెరుగుతాయని భావించి వినియోగదారులు ముందుగానే కొనుగోలు చేస్తున్నారు. నియోజకవర్గంలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల్లో వారపు సంతలు జరుగుతాయి. ఆయా మండలాల్లో ఆదివారం నుంచి శనివారం వరకు ఏదోక చోట వారపు సంత జరుగుతూనే ఉంటోంది. నాటుకోళ్లు, మేకలు,గొర్రెల పెంపకందారులకు వారపు సంతలే మార్కెట్‌లుగా మారాయి. దీంతో పెంపకందారులు ఎక్కువగా సంతలకే ప్రాధాన్యత ఇచ్చి వీటిని విక్రయిస్తున్నారు. వారపు సంతల్లో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలు డిమాండ్‌ను బట్టి పెంపకందారులు ఒక్కసారి ధరలు పెంచారు. మైదాన ప్రాంతాల్లో వీటి ధరలు మరింత


జి.మాడుగుల వారపు సంతలో విక్రయానికి తీసుకొచ్చిన మేకలు, గొర్రెలు

అధికంగా ఉండడంతో వ్యాపారులు, దళారులు సంతల్లో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలను కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు వాహనాల ద్వారా తరలిస్తున్నారు. రెట్టింపు ధరలకు మైదాన ప్రాంతాల్లో విక్రయించి వ్యాపారులు లాభాలార్జిస్తున్నారు. రానున్న రోజుల్లో గిరిజన గ్రామాల్లో ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలకు మరింత మార్కెట్ జరిగే అవకాశముందని పలువురు చెబుతున్నారు.

ఆశాజనకంగా లాభాలు

వారపు సంతల్లో ఒక కిలో నాటుకోడి రూ.800 నుంచి రూ.900లకు, 10 కిలోల మేక, గొర్రెలు రూ.8,000 నుంచి రూ.11,000వరకు ధరలు పలుకుతున్నాయి నాటు కోళ్లు, మేకలు, గొర్రెలకు ఆశించిన ధరలు లభిస్తున్నాయని పెంపకందాలు ఆనందం వ్యక్తం చేశారు. జి.మాడుగులలోని సంతలో ఈ


సంతలో విక్రయించటానికి తీసుకొచ్చిన నాటుకోళ్లు

వారం సుమారు 400మేకలు, గొర్రెలు, 500 నాటుకోళ్లు విక్రయాలు జరగ్గా, సుమారు రూ.35లక్షల వరకు లావాదేవీలు జరినట్టు అంచనా. ఏటా దసరా ముందు జరిగే వారపు సంతల్లో నియోజకవర్గంలో జరిగే వారపు సంతల్లో 5000 నాటుకోళ్లు, 4000మేకలు, గొర్రెలు సుమారు రూ.4కోట్లు నుంచి రూ.5కోట్లు వరకు లావాదేవీలు జరుగుతాయని పలువురు వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

ధరలు బాగున్నాయి



వారపు సంతల్లో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలకు ధర పెరగడంతో పెంపకందారుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. గ్రామాల్లో వీటి పెంచటానికి గిరిజనులు ఆసక్తి చూపిస్తున్నారు. జి.మాడుగుల వారపు సంతలో నాటుకోడి కిలో రూ.800, మేక 10కిలోలు రూ.8000 నుంచి రూ.9000లకు అమ్ముడయ్యాయి.

– చిన మత్స్యకొండబాబు, గడుతూరు గ్రామం

శభాష్ వలంటీర్


విశాఖ కేజీహెచ్‌లో రోగికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వసంత

అరకులోయ రూరల్: మండలంలో మారుమూల పంచాయతీ లోతేరు గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ వసంత సేవలకు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. లోతేరు గ్రామానికి చెందిన రత్నాలమ్మ గత కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ప్రభుత్వం ద్వారా పింఛన్ మంజూరవుతుంది. ఇందులో భాగంగా ఆమె గ్రామంలో అందుబాటులో లేరని, విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని గ్రామ వలంటీర్ వసంత తెలుసుకున్నారు. ఈ మేరకు ఆమెకు మంజూరైన పింఛన్ నగదును లోతేరు పంచాయతీ కేంద్రం నుంచి 140 కిలోమీటర్లు ప్రయాణించి, విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి నేరుగా పింఛన్ అందజేశారు. దీంతో రత్నాలమ్మ, ఆమె కుటుంబ సభ్యులు గ్రామ వలంటీర్ వసంతకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లోతేరు పంచాయతీ గ్రామ వలంటీర్ వసంత అందిస్తున్న ప్రజా సేవలకు హర్షం వ్యక్తం చేస్తూ పలువురు అభినందనలు తెలిపారు.

ఆలయ కమిటీ సహకరిస్తే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

వై.రామవరం: ఆలయ కమిటీ సహకరిస్తే మండలంలోని యార్లగడ్డ పంచాయతీ అటవీ ప్రాంతంలో ఉన్న గురమంద విశ్వనాథుని ఆలయ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అడ్డతీగల రేంజ్ అధికారి ఎస్. షహెన్‌షా అన్నారు. గ్రామ సర్పంచ్ పల్లాల పద్మావతి సమక్షంలో గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఆలయ కమిటీ సభ్యులతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంత పర్యాటక అభివృద్ధికి సంబంధించిన విషయంపై సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం రేంజి అధికారి మాట్లాడుతూ రంపచోడవరం అటవీశాఖ డీఎఫ్ఓ వి.జి.నరేంద్రియన్ ఆదేశాల మేరకు తాను ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మొదట విడతగా కొంత నిధులను అటవీశాఖ ద్వారా మంజూరు చేస్తారన్నారు. వాటితో పర్యాటక కేంద్రం అభివృద్ధి పనులను ప్రారంభిస్తారన్నారు. అంచెలంచెలు మరిన్ని నిధుల మంజూరుతో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. మారేడిమిల్లి పర్యాటక కేంద్రంలా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ మేరకు చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆలయ కమిటీ సభ్యులకు వివరించారు. కమిటీ అభిప్రాయాలు తెలియజేస్తే నివేదికను డిఎఫ్ఓకు పంపిస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పల్లాల వెంకటరమణారెడ్డి, పల్లాల పండురెడ్డి, విశ్వరెడ్డి, డిప్యూటీ రేంజి అధికారి సీహెచ్ సత్యనారాయణ, బీట్ అధికారి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.


ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమైన అడ్డతీగల రేంజ్ అధికారి షహెన్‌షా

నేడు అభివృద్ధి పనులకు భూమిపూజ

అడ్డతీగల: అడ్డతీగల మండలంలోని పలు చోట్ల వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు సోమవారం ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 11 గంటలకు 224 కొత్త పింఛన్ లబ్ధిదారులకు ఇరువురు నేతలు అందించనున్నారన్నారు. పనుకురాతిపాలెం–జడేరు గ్రామాల మధ్య నిర్మించనున్న మెటల్‌రోడ్డు నిర్మాణ పనులకు మధ్యాహ్నం 1 గంటకు భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తారన్నారు. ధాన్యంపాలెం–రావిగూడెం గ్రామాల మధ్య నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు 1.30 గంటలకు భూమిపూజ నిర్వహిస్తారన్నారు. ధాన్యంపాలెంలో నిర్మించిన గ్రామ సచివాలయం అనుబంధ విభాగాల భవనాలను 3 గంటలకు ప్రారంభిస్తారన్నారు. అనంతరం రావిగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొవాలని ఆయన కోరారు.

మండలాభివృద్ధికి అధికారులకు శిక్షణ

వై.రామవరం: గ్రామీణాభివృద్ధిశాఖ సర్వే మేరకు వై.రామవరం మండలాన్ని యాస్పిరేషన్ మండలంగా ప్రభుత్వం ప్రకటించినట్టు ఉపాధి హామీ ఏపీవో ఎం.కె.ఎస్.ప్రకాశరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని నీతీఆయోగ్ దేశంలోని 500 మండలాలను(బ్లాక్‌లను) ఏబీపీ మండలాలుగా గుర్తించినట్లు తెలిపారు. దీంట్లో భాగంగా ఏపీలోని 15 మండలాలను ప్రకటించినట్లు తెలిపారు. వీటిలో వై.రామవరం మండలం ఒకటి ఉందన్నారు. ఇందులో భాగంగా మండలాన్ని అభివృద్ధి చేయడం కోసం ఏబీపీ బ్లాక్‌లో పనిచేస్తున్న 7 ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులకు జాతీయగ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్‌ఐఆర్‌డిలో రెండు రోజులు శిక్షణ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల అభివృద్ధికి సహాయపడతామన్నారు. శిక్షణ పొందినవారిలో మండల వ్యవసాయశాఖ ఏఓ వై.ఉషారాణి, ఏపీవో ఎమ్‌కేఎస్ ప్రకాశరావు, మంగంపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి వనజ, గుర్తేడు వైద్యాధికారి జగదీష్, ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.శివరామచందు తదితరులున్నారు.


శిక్షణకు హాజరైన అధికారులు

చంపగూడలో విజయోత్సవ ర్యాలీ

డుంబ్రిగూడ: మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీ చంపగూడలో రెండో వార్డు సభ్యురాలు కిల్లో జమున విజయోత్సవ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. చంపగూడ పంచాయతీ రెండో వార్డుకు ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థిని కిల్లో జమున విజయం సాధించారు. ఈ మేరకు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీపీ ఈశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు నిదర్శనమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. ఎన్నికలను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. జగనన్న ప్రభుత్వంలోనే సుపరిపాలన అందుతోందన్నారు. సర్పంచ్‌లు నాగేశ్వరావు, రామ్మూర్తి, పీసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మొద్దు, మండల కన్వీనర్ గణపతి, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, నాయకులు సింహాచలం, కృష్ణారావు, సుమన్, మల్లేష్, సోషల్ మీడియ కన్వీనర్ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీపీఎం ర్యాలీ

అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్ట వారపు సంతలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌తో పాటు నిత్యావసర ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, గిరిజన చట్టాలు సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రామారావు, చిన్నబాబు, బుజ్జిబాబు, జోషి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

అరకులోయ రూరల్: మండలంలోని చినలబుడు పంచాయతీ కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాచిపెంట అప్పలనర్స ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీను అమలుచేయకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. నాయకులు బాలదేవ్, కుమారి, గ్రామస్తులు సిద్దార్థనాథ్, మోజేష్‌రాజ్, సీమోన్, అభిషేక్, ప్రశాంత్ , అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

అంతర పంటలతో అదనపు ఆదాయం

మెట్ట ప్రాంతాల్లో అధికంగా సాగు

కె.కోటపాడు: అంతర పంటల సాగుపై పలు గ్రామాల్లో రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో మెట్ట ప్రాంతాల్లో విస్తారంగా మామిడి తోటలు ఉన్నాయి. మామిడి కాపు ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉంటోంది. అనంతరం ఈ తోటల మధ్య ఖాళీ ప్రదేశాల్లో కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా తక్కువ కాలవ్యవధిలో దిగుబడి వచ్చే కాయగూరల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రధానంగా మండలంలో పాతవలస, పిండ్రంగి, మర్రివలస, గొట్లాం, సూదివలస, బొట్టవానిపాలెం, కె.సంతపాలెం గ్రామాల్లోని మామిడి తోటల్లో బరబాటి, బెండ, వంగ, టమాటా పంటలను సాగు చేస్తున్నారు.


సూదివలసలో మామిడిలో అంతర పంటగ బరబాటి సాగు

వరసిద్ధి వినాయకునికి విశేష పూజలు


హోమం చేస్తున్న భక్తులు

రావికమతం: టి.అర్జాపురం బాల వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో స్వామివారికి ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పంచామృతాలు, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు, హోమం నిర్వహించారు. సంకష్టహర చతుర్థి సందర్భంగా పలువురి దంపతులతో అర్చకుడు లక్ష్మణరావు దూర్వాయుగ్మార్చన, ప్రత్యేక పుష్పార్చన, విశేష సుగంధ ద్రవ్యాలతో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.

జోరుగా కల్తీ తేనె అమ్మకాలు

అనంతగిరి: మండలంలోని అనంతగిరి ఘాట్‌రోడ్డులోని కల్తీ తేనె అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పర్యాటకులను టార్గెట్ చేసుకుని, మైదాన ప్రాంతాల వ్యాపారులు కల్తీ తెనే అమ్మకాలను చేపడుతున్నారు. అడిగే వారు లేకపోవడంతో వ్యాపారాన్ని దర్జాగా సాగిస్తున్నారు. గిరిజనులు అడవుల్లో సేకరించే స్వచ్ఛమైన తెనేకు డిమాండ్ కోల్పోయే పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. మన్యంలోని అందాలను తిలకించేందుకు పర్యాటకులు అనంతగిరి నుంచి ఘాట్‌రోడ్డు మీదుగా అరకులోయకు చేరుకుంటారు. ఈ మార్గంలో మైదాన ప్రాంత వ్యాపారులు కల్తీ తేనెను పాలిథిన్ కవర్లలో నింపి స్వచ్ఛమైనదిగా పర్యాటలను నమ్మించి మోసం చేస్తున్నారు. వీరి మోసపూరిత వ్యాపారం వల్ల అడవుల్లో సేకరించిన స్వచ్ఛమైన తేనెకు డిమాండ్ తగ్గిపోతోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్తీ తెనే కారణంగా అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని పలువురు వైద్యులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కల్తీ తేనె విక్రయాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని, పలువురు గిరిజనులు, పర్యాటకులు కోరుతున్నారు.


ఘాట్‌రోడ్డులో కల్తీ తేనె అమ్మకాలు చేస్తున్న మైదాన ప్రాంత వ్యాపారులు

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన

మాకవరపాలెం: సంస్కృతి, సంప్రదాయాలపై పిల్లలకు అవగాహన కల్పిస్తున్నట్టు సమరసతా సేవా ఫౌండేషన్ ప్రచారకర్త రత్నమాల తెలిపారు. స్థానిక రామాలయంలో ఆదివారం నుంచి పిల్లలకు భక్తిభావం పెంచేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాభారతంలోని శ్లోకాలను నేర్పించడంతోపాటు సంస్కృతి, సంప్రదాయాలపై వివరించారు. ప్రతి ఆదివారం పిల్లలకు భక్తి భావం పెంపొందించే దిశగా కార్యక్రమాలు చేపడతామని రత్నమాల తెలిపారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఎస్.రాయవరం: కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో 2008–09 సంవత్సరాల్లో 10 వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకుని అలనాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. పాఠశాల దశ నుంచి వెళ్లాక 15 ఏళ్ల తరువాత తామంతా కలుసుకోవడం మంచి అనుభూతిని ఇచ్చిందని చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గడిపిన పూర్వ విద్యార్థులు తాము స్థిరపడ్డ రంగాలపై చర్చించుకున్నారు.

మట్టి గణపతిని పూజించాలి

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఈనెల 18వ తేదీన జరిగే వినాయక చవితి నాడు అందరూ వారివారి గృహాల్లోను, వీధులలో మట్టిగణపతిని పూజించాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి కోరారు. స్థానిక నెహ్రూచౌక్‌లో ఆదివారం మట్టివినాయకులనే పూజించాలని కోరుతూ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది మట్టి గణపతిని పూజించాలని నినాదంతో ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.సోమశేఖర్ పట్నాయక్, ఆళ్ల నాగేశ్వరరావు, ఎస్.వి.కృష్ణ, కొప్పాక శంకరరావు, ఎం.మహేష్, ఆడారి శ్రీనివాసరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మట్టివినాయకున్ని పూజించాలని ప్రచారం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించాలి

రాంబిల్లి: గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ రమణ అన్నారు. కొత్తపేట గ్రామంలో ఆదివారం సమరసత ఫౌండేషన్ మండల కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో పూజలు, భజనలు, కోలాటాలు, నగర సంకీర్తన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ ధర్మ ప్రచారకులు కె.అప్పారావు, ఎస్.నూకరాజు, గగన్, గోవిందరెడ్డి పాల్గొన్నారు.


సమావేశమైన సమరసత ఫౌండేషన్ కమిటీ సభ్యులు

7న కృష్ణాష్టమి వేడుకలు

అనకాపల్లిటౌన్: స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రం రహదారిలోని ఉప్పల చంద్రశేఖరరావు కల్యాణమండపంలో ఈనెల 7న శ్రీ కృష్ణ జన్మాష్టమి మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు హరేకృష్ణ సత్సంగ మందిరం అధ్యక్షుడు దుర్లబ కృష్ణప్రేమదాస్ ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఉట్టి ఉత్సవాన్ని జరుపుతాయని చెప్పారు. మధ్యాహ్నం 1500 మందికి అన్నదాన కార్యక్రమం , సాయంత్రం 5 గంటలకు తలసిపూజ, 5.30 గంటలకు సంధ్యాహారతి, 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 7 గంటలకు శ్రీ రాధా కృష్ణులకు పంచామృత, ఫలరసాలతో సహస్ర కలశాభిషేకం, రాత్రి 9గంటలకు ఉంజల సేవ అనంతరం మహా ప్రసాద వితరణ చేయనున్నట్టు ఆయన తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న దాతలు

యలమంచిలి : రక్తదానం ప్రాణదానంతో సమానం అని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ బంగారు శెట్టి అన్నారు. ఆదివారం యలమంచిలి వాసవీ కళ్యాణ మండపంలో నవభారత్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో 40 మంది సభ్యులు రక్తదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రగాయాలు పాలవడం, రక్తస్రావం జరగడం వల్ల సకాలంలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఇటువంటి తరుణంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. రక్త నిల్వలను ఏఎస్‌రాజా బ్లడ్‌బ్యాంక్‌కు సిబ్బందితో తరలించారు. ఈ కార్యక్రమంలో కె.పరమేష్, నారాయణమూర్తి, ఏపి జగన్నాథం, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.